క్లుప్తంగా

తడిసిన ప్రతి గింజనూ కొంటాం

భువనగిరిటౌన్ : అకాల వర్షానికి తడిసిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్లాల్లో వరి ధాన్యం తడిసిపోవడంతో ఆవేదన చెందుతున్న రైతులు అధైర్యపడొద్దన్నారు. నియోజకవర్గంలో కురిసిన వర్షానికి నష్టపోయిన వివరాలను తెలుసుకోవాలని అధికారులకు పలు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై రజనీకర్

ఆలేరురూరల్ : క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై రజనీకర్ అన్నారు. శుక్రవారం ఆలేరు మండలం శారాజీపేట జెడ్పీహెచ్ఎస్ మైదానంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ క్రీడా శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా అధికారి ధనుంజయ్, ప్రధానోపాధ్యాయులు తుప్పరి జ్యోతిరాజ్, పీఈటీ మధుసూదన్, రచ్చ రామ్‌నర్సయ్య, ఏఎంసీ డైరెక్టర్ చిలుకు కిష్టయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రజనీకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని శారాజీపేట గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని వారికి వ్యక్తిగత సమాచారం ఇవ్వొద్దన్నారు. ఓటీపీ, సీవీవీ నంబర్లు పార్వర్డ్ చేయొద్దన్నారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్సై ఉపేందర్‌రెడ్డి, కానిస్టేబుల్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న గ్రామస్తులు

మోత్కూరు : పదవ తరగతి వార్షిక ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన మండలంలోని పొడిచేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను శుక్రవారం పాఠశాల ఆవరణలో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆర్.సంధ్యారాణి, విద్యా కమిటీ చైర్మన్ సబిత, మాజీ సర్పంచ్ మధు ఉన్నారు.

రామన్నపేట : ఇంటర్ ఫలితాల్లో రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల టాపర్లుగా నిలిచిన విద్యార్థులు కాలేరు నందిని, కాలేరు శ్రేష్టలను శుక్రవారం రామన్నపేట మాజీసర్పంచ్ గోదాసు శిరీషాపృథ్వీరాజ్ సన్మానించారు.

బీఆర్ఎస్ నాయకుల ముందుస్తు అరెస్ట్

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలో నిర్వహించిన చేనేత సదస్సుకు చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందుస్తు అరెస్ట్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ తమను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. అరెస్టయిన వారిలో బీఆర్ఎస్‌పట్టణ ప్రధానకార్యదర్శి గునిగంటి మల్లేశ్, సీనియర్ నాయకులు కొంక లక్ష్మీనారాయణ, చింతకింది కిరణ్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం


బీరప్ప దేవాలయంలో కలశపూజ చేస్తున్న భక్తులు

రామన్నపేట : మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ బీరప్ప దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శుక్రవారం కనుల పండువగా ప్రారంభయ్యాయి. ఉదయం ఆలయంలో గణపతి, గౌరిపూజ అనంతరం కలశ, మండపారాధన పూజలు నిర్వహించారు. శ్రీ బీరప్ప, కామరాతి, అక్క మహంకాలి, బుగ్గపోశమ్మ ప్రతిష్ఠాపన విగ్రహాలతో పాటు ధ్వజస్తంభాన్ని ఊరేగించారు. అనంతరం జలాదివాస పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద కుర్మ మోటె లక్ష్మన్, ఈతాపుల రాజు సిందం లింగయ్య, మోటె మల్లేశం, గొరిగె నర్సింహ, మిర్యాల మల్లేశం, రమేష్, బండ లింగస్వామి, బెడిద లింగస్వామి, బీరప్ప పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

మోత్కూరు : మండలంలోని పొడిచేడు గ్రామంలో నూతనంగా చేపట్టిన శ్రీ కనకదుర్గ మాత ఆలయ నిర్మాణానికి మో త్కూరు రైతు సేవా సహకార సంఘం చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు రూ.1.50లక్షల విరాళాన్ని శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పేలపూడి బ్రదర్స్ సత్యనారాయణ చౌదరి, మాజీ సర్పంచ్ పేలపూడి మధు, కొప్పె మల్లేష్, షణ్ముఖాచారి, చిన్న లింగయ్య, ఒర్సు నాగులు పాల్గొన్నారు.

పల్లె చెరువులకు జలకళ

- గోదావరి జలాలతో నిండుతున్న తుర్కపల్లి మండల చెరువులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

తుర్కపల్లి: మండే వేసవిలోనూ తుర్కపల్లి మండలంలోని వివిధ గ్రామాల చెరువులు జలకళను సంతరించుకున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను విడుదల చేయడం వల్లమండలాల్లోని చెరువులన్నీ నిండుకుండల్లా మారాయి. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కరుకపోవడంతో చెరువుల్లో నీళ్ల లేకుండా పోయాయి. దీంతో ఇటు సాగుకు.. అటు తాగునీటికి మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పంటలు ఎండుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుల విన్నపం మేరకు ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రత్యేక చొరవ తీసుకుని గతనెల ఇరిగేషన్ అధికారులతో సమావేశమై చర్చించారు. తాగు, సాగునీటి అవసరాలకు నియోజకవర్గంలోని చెరువులకు నీరిందించాలని ఆదేశించారు. దీంతో కాళేశ్వరం నుంచి ప్రధాన కాల్వ ద్వారా కొండపోచమ్మ సాగర్‌కు గోదావరి జలాలు విడుదల చేస్తున్నారు. అక్కడి నుంచి కాలవ్వల ద్వారా మండలంలోని వివిధ గ్రామాల చెరువులను నింపారు.


నీటితో కళకళలాడుతున్న వాసాలమర్రిలోని కొత్తకుంట చెరువు


గోపాలపురంలోని కొండపోచమ్మ చెరువులోకి చేరిన గోదావరి జలాలు

నిండుతున్న చెరువులు

కొండపోచమ్మ సాగర్ నుంచి గోదావరి జలాలు నీటి విడుదలతో మండలంలోని గోపాలపురంలో కొండపోచమ్మ చెరువు, పొట్టోనికుంట నాగాయిపల్లి చెరువు, చిన్నలక్ష్మాపురంలోని దాపల్ చెరువు, మాదాపూర్ జగ్గయ్య చెరువు, కొత్త చెరువు, వాసాలమర్రి, కొత్తకుంట, పంతెకుంట చెరువు, మైసమ్మకుంట, తుర్కపల్లిలోని బహుదూర్‌మియా, వెంకటపూరంలోని సూది లేని చెరువు, మాల్కాపురంలో తోక చెరువు, ముల్కలపల్లిలోని చౌదరి చెరువు, ధర్మారంలోని గోవింద్ చెరువు, పల్లెపహాడ్‌లోని సోమయ్య చెరువు నిండుకుండను తలపిస్తున్నాయి. ఫలితంగా చెరువుల్లోని నీరు తమకు సాగు, తాగుతోపాటు పశువుల దాహార్తిని తీర్చేందుకు ఎంతో ఉపయోగపడుతోందని మండల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కాళేశ్వరం నీళ్లతో సమస్య తీరింది

రైతులకు నీళ్ల సమస్య రావొద్దని కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాల విడుదల చేస్తున్నారు. దీంతో మండలంలోని చెరువులకు నీళ్లు చేరాయి. ఫలితంగా మా వ్యవసాయం సాఫీగా సాగుతోంది. ఎండి పోయే పంటలను బతికించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

– కాశమైన మహేష్, రైతు గోపాలపురం

నేత్రపర్వంగా ఊంజల్ సేవోత్సవం

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి ఆలయ తిరు వీధిలో ఊరేగించారు. అమ్మవారికి మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్టింపజేసి ఊంజల్ సేవ చేపట్టారు.ఇక ప్రధానాయలంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు.. గర్భాలయంలో స్వయంభూలకు నిజాభిషేకం చేసి సహస్ర నామార్చనతో కొలిచారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపం, ముఖ మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవోత్సవం తదితర పూజలు నిర్వహించారు.


ఆండాళ్‌దేవికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

● తాగునీరు వృథా



మోత్కూరు : వేసవి నేపథ్యంలో పలు ప్రాంతాల్లో నీటి ఎద్దడిని ఎదుర్కొంటూ ఉంటే.. మున్సిపల్ కేంద్రంలోని సుందరయ్య కాలనీలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి తాగు నీరు వృథాగా పోతోంది. రోజుల తరబడి నీరు ఇలా వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగు నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

షాదీఖానాకు నూతన భవనం నిర్మిస్తాం : ఎమ్మెల్యే

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలో శిథిలావస్థకు చేరిన షాదీఖానాకు నూతన భవనం నిర్మిస్తానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. భవన నిర్మాణం కోసం అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ పట్టణ కేంద్రంలోని ముస్లింలు శుక్రవారం మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన కలెక్టర్ హనుమంతరావుతో ఫోన్‌లో మాట్లాడి భవన నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూర్చాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మాజీ సర్పంచ్ పబ్బు రాజు, కౌన్సిలర్ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు ఎండి.బాబాషరీఫ్, షాదీఖానా చైర్మన్ ఎండీ.కరీం, మాజీ చైర్మన్ ఎండీ ఎజాస్‌పాష, నాయకులు ఎండీ. చోటేబాయ్ ఉన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న మైనార్టీ నాయకులు

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకు పోరాడాలి

మోత్కూరు : కేంద్రం ప్రభుత్వం నూతనం గా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకు పోరాడాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. మండలంలోని పాలడుగు, పాటిమట్ల గ్రామాల్లో శుక్రవారం జరిగిన మే డే వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతన లేబర్ కోడ్‌లు అమలైతే కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. పోరాడి సాధించుకున్న 29కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుగుణంగా మారుస్తుందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను పోరాటాల ద్వారానే తిప్పి కొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దడిపల్లి ప్రభాకర్, కురుమేటి యాదయ్య, రాచకొండ కనకయ్య, కొంపెల్లి గంగయ్య, పిట్టల చంద్రయ్య, సైదులు, మెతుకు సైదులు, నాగరాజు, బండి రవి, వడ్డేపల్లి లక్ష్మణ్, దునుక సత్యనారాయణ, మల్ల య్య, మెతుకు కృష్ణ, కురుమేటి సోమయ్య పాల్గొన్నారు.


జెండా ఎగుర వేస్తున్న నాయకులు

కులగణన నిర్ణయంపై హర్షం


పీఎం నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

సంస్థాన్ నారాయణపురం : జనగణనతో పాటు కులగణన చేపట్టాలనే కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పీఎం మోదీ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుర్వి రాజుగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరు వీరారెడ్డి, బచ్చన బోయిన దేవేందర్, జక్కలి రాజు, దాసోజు వెంకటాచారి, వంగరి రఘు, లింగయ్య, జగత్ కుమార్, కిరణ్, యాదగిరి, గిరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సర్వీస్‌రోడ్ల వెంట అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలి

చౌటుప్పల్ : పట్టణంలోని సర్వీస్‌రోడ్ల వెంట అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమణగోని శంకర్, మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, జిల్లా కార్యదర్శి ఆలె చిరంజీవి డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సర్వీస్‌రోడ్ల నిర్మాణం, అక్రమ కట్టడాలను కూల్చివేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న ధర్నా నిర్వహించనున్నటట్లు తెలిపారు. తెలిపారు. ఈ సమావేశంలో మండల, పట్టణ కమిటీ అధ్యక్షులు కైరంకొండ అశోక్, కడారి కల్పన, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు, మండల మాజీ అధ్యక్షుడు రిక్కల సుధాకర్‌రెడ్డి, ముత్యాల భూపాల్‌రెడ్డి, గుజ్జుల సురేందర్‌రెడ్డి, తి రుపతిరెడ్డి, కట్ట కృష్ణ, వనం ధనుంజయ్య, కాసుల వెంకటేశం, అమృతం దశరథ, కంచర్ల వెంకట్‌రెడ్డి, పబ్బు వంశీ, ఉష్కాగుల నాగరాజు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయాలి

యాదగిరిగుట్ట: పట్టణంలోని శివాజీ నగర్‌లో 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇంటిని ఖాళీ చేయించాలని కొందరు వ్యక్తులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని.. తమకు న్యాయం చేయాలని పట్టణానికి చెందిన అగర్వాల్ మామ్ చందు, అగర్వాల్ శంకర్ లాల్, అగర్వాల్ హనుమంత్, అగర్వాల్ గణేష్, సత్యనారాయణలు కోరారు. శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 40 ఏళ్ల క్రితం గోర్ల నర్సయ్య తన ఇంటిని మా తండ్రి అగర్వాల్ శంకర్‌లాల్‌కు అమ్మారని తెలిపారు. అప్పటి నుంచి ఆ ఇంట్లోనే తాము నివాసం ఉంటున్నామన్నారు. ఇటీవల గోర్ల నర్సయ్య కోడలు గోర్ల నిర్మల ఇళ్లు తమదని ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. సమావేశంలో కుటుంబ సభ్యులు అగర్వాల్ చందులాల్, అగర్వాల్ రాంలాల్, మోతీలాల్, మోహన్‌లాల్, హరికిషన్, శివ కుమార్ తదితరులు ఉన్నారు. ఇదే విషయంపై గోర్ల నిర్మల మాట్లాడుతూ ఆ ఇంటిపై చట్టపరంగా అన్ని హక్కులు తమకే ఉన్నాయని తెలిపారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

ఆత్మకూరు(ఎం): మండలంలోని కొరటికల్ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన దుప్పెల్లి చంద్రమ్మ కుటుంబాన్ని శుక్రవారం కి కెహెచ్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు పరామర్శించారు. అనంతరం రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోల సత్తయ్య, నరుకుడు బిందెల సైదులు, దారం ఆంజనేయులు, సుంచు మల్లయ్య, సుంచు శ్రీనువాస్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు..

రామన్నపేట : మండలంలోని కక్కిరేణి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నల్ల పాపయ్య కుటుంబానికి మన ఆపద్బాంధవుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యురాలు టి.మల్లిక, గ్రామస్థులు శ్రీనివాస్, నాగమ్మ, సైదులు, ముత్తమ్మ, దేవేందర్, నరసింహ, కవిత, యశోద పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

సంస్థాన్ నారాయణపురం: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారిణి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ అన్నారు. మండల కేంద్రంతో పాటు సర్వేల్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఐలు జుబేర్‌ద్దీన్, పాండు తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీస్‌లు పునరుద్ధరించాలని వినతి

సంస్థాన్ నారాయణపురం: హయత్ నగర్ డిపో నుంచి మండల కేంద్రానికి వచ్చే బస్సు సర్వీస్‌లను పునరుద్ధరించాలని కోరుతూ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మందుగుల బాలకృష్ణ శుక్రవారం హయత్‌నగర్ డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. మండలానికి వచ్చే బస్సు సర్వీసులు రద్దు కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

పహల్గాం మృతులకు నివాళి

ఆలేరు : పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మృతి చెందిన వారి ఆత్మశాంతి చేకూరాలని కోరుతూ శ్రీలక్ష్మీ గోదా రంగనాయక స్వామి ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మోర్తాల గోపాలరెడ్డి, పాశికంటి శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.

మాద శంకర్‌కు పరామర్శ

వలిగొండ : ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మండలంలోని రెడ్లరేపాక గ్రామానికి చెందిన మాద శంకర్ గౌడ్ ను శుక్రవారం భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో మొగుళ్ల శ్రీనివాస్ గౌడ్, నెల్లుట్ల శ్రీనివాస్ గౌడ్, లంబు శీనన్న, బండి అశోక్ గౌడ్, మడిపడి అంజనేయులు, కోమల కుమార్, ధోని, శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

పోచంపల్లి బ్యాంకు సేవలను విస్తరించాలి

● మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

భూదాన్‌పోచంపల్లి : ప్రజలకు నాణ్యమైన సేవలందిస్తున్న పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు సేవలను రాష్ట్రమంతా విస్తరింపజేయాలని వ్యవసాయ, సహకార, చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. భూదాన్‌పోచంపల్లిలో నిర్మించిన పోచంపల్లి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ప్రధాన కార్యాలయం నూతన భవనాన్ని శుక్రవారం ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, చేనేతజౌళిశాఖ కమిషనర్ శైలజా రామయ్యార్, కలెక్టర్ హనుమంతరావు, తెలంగాణ కోఆపరేటివ్ అర్బన్ న్‌బ్యాంకుల ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మదన గోపాలస్వామి, తడక వెంకటేశంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ నాడు దివంగత కొంగరి భాస్కర్ సారథ్యంలో కేవలం రూ.6.50 లక్షలతో ప్రారంభించిన బ్యాంకు నేడు లక్ష మంది ఖాతాదారులతో రూ.4వందల కోట్ల టర్నోవర్‌కు చేరుకోవడం గొప్ప విషయమన్నారు. ప్రస్తుతం 11 శాఖలతో ఉన్న బ్యాంకు సేవలను రాష్ట్రమంతటా విస్తరించాలని సూచించారు. బ్యాంకుకు అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం ద్వారా అందించుటకు తమవంతుగా కృషి చేస్తామన్నారు. అలాగే సహకార వ్యవస్థ పటిష్టకు పాటుపడుతామన్నారు.అంతకుముందు బ్యాంకు సాధించిన ప్రగతి, వినియోగదారులకు అందిస్తున్న సేవలను బ్యాంకు చైర్మన్ తడక రమేశ్, సీఈఓ సీత శ్రీనివాస్ మంత్రికి వివరించారు. అనంతరం మంత్రితో పాటు ఎంపీ, ఎమ్మెల్యేను శాలువా కప్పి, మగ్గం మెమెంటో అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, భారత లవకుమార్, పాక మల్లేశ్, సీఈఓ సీత శ్రీనివాస్, డైరెక్టర్లు కర్నాటి బాలసుబ్రహ్మణ్యం, ఏలే హరిశంకర్, సూరెపల్లి రమేశ్, వేణు, కావ్య, కర్నాటి భార్గవి, ఎల్ల స్వామి, భాస్కర్, నర్సింహ, బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకును ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

వలిగొండ : రాజ్యాంగ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీమ్లా నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాశం సత్తి రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అరూర్, సుంకిశాల, వెల్వర్తి గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నూతి రమేష్, చిట్టెడి జనార్దన్ రెడ్డి, బండారు నర్సింహా రెడ్డి, బుర్ర నర్సింహ, తుమ్మల శ్రీనివాస్,ఆవుల స్వామి, కర్ణాకర్, దానయ్య, బాల్ శంకర్, సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాహుల్‌గాంధీ, రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వలిగొండ : కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం కాంగ్రెస్ విజయంగా అభివర్ణిస్తూ ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి సంకల్పానికి కేంద్రం అనుసరణగా ఈ నిర్ణయం తీసుకుందంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో భీమా నాయక్, పాశం సత్తిరెడ్డి, కంకల కిష్టయ్య, చెరకు శివ్వయ్య, చిలుగూరి సత్తిరెడ్డి, బత్తిని లింగయ్య, బత్తిని సహదేవ, కాసుల వెంకన్న పాల్గొన్నారు.

భువనగిరిలో సినిమా షూటింగ్

భువనగిరి: పట్టణంలోని నల్లగొండ చౌరస్తా రోడ్డు మార్గంలో శుక్రవారం సినిమా షూటింగ్ నిర్వహించారు. ఎస్.విజయేందర్ దర్శకత్వంలో ప్రియదర్శి హీరో, నిహారిక హీరోయిన్ పాత్రలో నటిస్తున్న చిత్రానికి సంబంధించిన పలు సన్నివేశాలను చిత్రీకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విలన్, హీరోల మధ్య చేజింగ్ సన్నివేశాలను షూట్ చేశారు. హీరో ప్రియదర్శిని చూసేందుకు స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సినిమాలో యూట్యూబ్ స్టార్ అసిస్ బెహరా, మ్యాడ్ సినిమా నటుడు విష్ణు, శివరాంపల్లి సినిమా నటుడు రాఘవా మయూర్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. శనివారం రైతు బజార్ మార్కెట్‌లో పలు సన్నివేశాలను షూట్ చేయనున్నట్లు సమాచారం. ఈ సినిమాను జూలైలో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు.


భువనగిరిలో కార్ చేజింగ్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్న సినిమా యూనిట్ సభ్యులు

మురుగు నీటిలో తాగునీటి గేట్‌వాల్వ్



అడ్డగూడూరు: మండల కేంద్రంలోని చింతలగడ్డకాలనీ ప్రధాన రోడ్డులో గేట్‌వాల్వ్ లీకేజీ అవుతోంది. దీంతో చెత్త చెదారం, మురుగు నీరు నిల్వ ఉంటుంది. ఈ మురుగు నీరు గేట్ వాల్‌లోకి చేరి తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మోత్కూరు : మండల కేంద్రంలో కాంగ్రెస్ మహిళా విభాగం పట్టణ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ, పట్టణ అధ్యక్షురాలు అన్నెపు పద్మ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షురాలిగా కురుమిల్ల ప్రమీల, ప్రధాన కార్యదర్శిగా గంజి మంగ, సహాయ కార్యదర్శిగా సోమ నర్సమ్మలకు నియామక పత్రాలు అందజేశారు.

వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బొమ్మలరామారం: గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ ఎంపీటీసీ హేమంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ యంజాల కళ అన్నారు. మండలంలోని రామలింగంపల్లి గ్రామంలో కేపీహెచ్‌బీ ఐకాన్ ఆస్పత్రి కూకట్‌పల్లి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం డాక్టర్లు కృష్ణారావు, వీరన్న, నవ్య రాజేశ్వరీ, షబానా, డైటీషియన్ షబాన, ఆసుపత్రి మేనేజర్ యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ పురోహితులు బాలగంగాధర్ పంతులు, చంద్రశేఖరశాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గురువారం రాత్రి పార్వతిపరమేశ్వరుల కల్యాణం జరిపించారు. ఆయా కార్యక్రమాల్లో దేవాలయ కమిటీ చైర్మన్ గుండెగాని అయిలయ్య, ఏనుగు సుధాకర్‌రెడ్డి, ఏనుగు సురేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు జన్నాయికోడె నగేష్, బీసు చందర్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ పి. పూర్ణచందర్ రాజు, మాజీ ఎంపీటీసీలు యాస కవిత, దిగోజు నర్సింహచారి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గడ్డం దశరథ గౌడ్, వివిధ పార్టీల నాయకులు యాస లక్ష్మారెడ్డి, యాస ఇంద్రారెడ్డి, గజరాజు కాశీనాథ్, రచ్చ గోవర్ధన్, మల్లేశం గౌడ్, లోడి వెంకటయ్య, నాతి రాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ పునరుద్ధరణ


వినాయక చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్


జగదేవ్‌పూర్ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆగిన వాహనదారులు

భువనగిరిటౌన్ : జిల్లా కేంద్రంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తొలగించిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఇటీవల పునరుద్ధరించారు. పట్టణంలోని వినాయకచౌరస్తా, జగదేవ్‌పూర్ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. ఇన్నాళ్లు ఈ కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా వెళ్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తేవి. దీనిని దృష్టిలో పెట్టుకుని కూడళ్ల వద్ద పోలీసులు సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. దీంతో కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్యకు చెక్ పడినట్టైంది.అదేవిధంగా రోడ్డుకు ఇరువైపులా దుకాణదారులు ఆక్రమించుకున్న స్థలాలను కూడా ఖాళీ చేయిస్తే వాహనదారులకు ఇబ్బందులు తొలుగుతాయని పలువురు కోరుతున్నారు.